క్లుప్తంగా

వ్యవసాయ సూచనలు పాటించాలి

గుడివాడరూరల్: సార్వా వరిసాగులో వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలను రైతులు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి బి.అనంతలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉందని, ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడటం మంచిది కాదన్నారు. సాగులో దోమలు, ఎలుకల నిర్మూలనకు రైతులు ఆర్‌బీకే సెంటర్లలో వ్యవసాయశాఖ సహాయకుల సహకారంతో నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు.

వైకుంఠరథం అందజేత

కూచిపూడి (మొవ్వ): గుడివాడ రోటరీ కమ్యూనిటీ ట్రస్ట్ చైర్మన్ గవిర్నేని బాబు శ్రీకర్ అందించిన సుమారు రూ.16 లక్షల విలువైన వైకుంఠ రథాన్ని, కాశీబొట్ల నారాయణమూర్తి అందించిన రూ.70 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్‌ని రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ కూచిపూడి వారికి అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ సుబ్బారావు మాట్లాడుతూ వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్స్ కావలసినవారు 9440979373, 9440346774 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అసిస్టెంట్ గవర్నర్ జీ రవీంద్ర, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కే రామాంజనేయులు, వి.రవిబాబు, సభ్యులు కోనేరు మంజునాథ్, పాగోలు రమేష్ బాబు పాల్గొన్నారు.

తెగుళ్లు, పురుగులపై నిఘా

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ, రసాయనిక వ్యవసాయ వరి పొలాల్లో సిబ్బంది రైతులతో కలిసి తెగుళ్ల, పురుగులపై నిఘా(పెస్ట్ సర్వేలెన్స్) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సర్వేలో, ప్రకృతి వ్యవసాయ పొలాల్లో ఎటువంటి చీడపీడలు గుర్తించలేదని, రసాయనిక వ్యవసాయ పొలాల్లో ప్రస్తుతం పచ్చ పురుగును గుర్తించినట్లు తెలిపారు. మండల ఇన్‌చార్జి నాగవిజయ, ఐసీఆర్పీలు రమేష్, ఉషారాణి, నజీర్, నాగవాణి రైతులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

ముదినేపల్లి రూరల్: చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అన్న సమారాధనలు నిర్వహించారు. చిగురుకోట శివారు నరసన్నపాలెంలో మంగళవారం రాత్రి జరిగిన అన్నసమారాధనలో 2 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గంగాపురంలో బుధవారం అన్నసమారాధన చేశారు. చిగురుకోట, చినకామనపూడి నరసన్న గ్రామాలకు చెందిన 1500 మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ముదినేపల్లి శివారు అన్నవరం కాలువగట్టుపై ఏర్పాటుచేసిన గణేషుని విగ్రహం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

సిటీ కేబుల్ రామకృష్ణకు నివాళి

గుడివాడ టౌన్: కేబుల్ వ్యవస్థకు అంకురార్పణచేసి అనేకమందికి ఉపాధి కల్పించిన మహోన్నత వ్యక్తి పొట్లూరి రామకృష్ణ అని గుడివాడ సిటీకేబుల్ ఎండీ కొల్లి నారాయణ ప్రసాద్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం రామకృష్ణ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎండీ ఈడ్పుగంటి అర్జునరావు, సిటీకేబుల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తోట్లవల్లూరు: స్థానిక పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కుసుమకుమారి బుధవారం సందర్శించారు. గ్రామంలోని 10, 11, 12, 13, 14, 15, 16వ నంబరు పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద ఉన్న సౌకర్యాలు, పరిస్థితులపై కుసుమకుమారి ఆరా తీశారు. వీఆర్‌ఓలు డి.నాగేశ్వరరావు, అసదుల్లా పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య సంరక్షణ

ముదినేపల్లి రూరల్: పోషకాహారంతో మహిళలకు ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కే మల్లీశ్వరి అన్నారు. మండలంలోని శ్రీహరిపురం శివారు ఐనంపూడి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహారమాసోత్సవాలు నిర్వహించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాల ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు మల్లీశ్వరి వివరించారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, శ్రీహరిపురం, కాకరవాడ, దేవరం, కోమర్రు, చేవూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీల్లో తక్కువ వడ్డీకే రుణాలు

కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ పద్మావతి, ఎమ్మెల్యే డీఎన్నార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: వాణిజ్య బ్యాంకులకు దీటుగా తక్కువ వడ్డీలకే రుణాలు అందిస్తూ వేల కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తున్నట్లు కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని కోరుకొల్లు సొసైటీ నూతన గోడౌన్‌ను, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి, ఎమ్మెల్యే డీఎన్నార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ జిల్లాలోని సొసైటీలు అభివృద్ధి పథంలో పయనిస్తూ రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నాయన్నారు. ఇలాంటి కారణాల వల్లనే కేడీసీసీ బ్యాంకు జాతీయస్థాయిలో ఉత్తమ బ్యాంకుగా అవార్డు పొందినట్లు తెలిపారు. కోరుకొల్లు సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న అధ్యక్షుడు నరసయ్య, కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగనన్న రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్ రైతుభరోసా, పంటల ఉచిత బీమా, మద్దతు ధర, ధాన్యం కొనుగోలు, పంటల నష్ట పరిహారం, బీమా పరిహారం వంటి పథకాలను సమర్థవంతంగా సకాలంలో అమలు చేస్తూ రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు చెప్పారు. అదే విధంగా సహకార బ్యాంకులకు అనుసంధానంగా ఉన్న సొసైటీల ద్వారా తక్కువ వడ్డీలకే పంట రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు. గోడౌన్ల ఏర్పాటుతో సొసైటీలు వ్యవసాయ ఆధారిత వ్యాపారాలను చేపట్టే అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, డీసీఎంఎస్ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, వైస్ ఎంపీపీలు కనక దుర్గారాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోదండ రామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు పెనుమాల రమేష్, ఎంపీటీసీ చెన్నంశెట్టి శిరీష పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- వెంట్రప్రగడలో గడప గడపకు మన ప్రభుత్వం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వెంట్రప్రగడ(పెదపారుపూడి): ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమంలో నూతన అధ్యాయానికి నాంది పలికారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యల వలన ఇబ్బందులు ఎమ్మెల్యేకి కొందరు వివరించారు. దీంతో వెంటనే సంబంధింత అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్న ప్రతి పక్షాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. గ్రామాల వారీగా అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. ఎంపీపీ గోగం సురేష్, ఎంపీటీసీలు జాజుల శ్రీనివాసరావు, చదలవాడ పద్మజ, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మండవ జానకరామయ్య (మున్నా), పంచాయతీ కార్యదర్శి సాగరరాణి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి సమస్యకు పరిష్కారం

మత పెద్దలతో కలెక్టర్, ఎమ్మెల్యే, పీడీ చర్చల ఫలితం



చర్చల్లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, పీడీ, మత పెద్దలు

నిడుమోలు(మొవ్వ): పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చొరవతో మొవ్వ మండలం నిడుమోలులోని తానేష జామియా మసీదు సమస్యకు పరిష్కారం లభించింది. బుధవారం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణరెడ్డితో కలిసి మసీదు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నం-విజయవాడ 65వ జాతీయ రహదారిని ఆరువరసలతో నిర్మించాల్సి ఉండగా నిడుమోలు వద్ద ఉన్న మసీదు, ఖబరాస్తాను, ముస్లిం పితృదేవతల సమాధులు ఉన్నాయని, జాతీయ రహదారి విస్తరణలో వాటిని కోల్పోకుండా కమిటీవారు కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని, ఈ నేపథ్యంలో మసీదు ప్రాంతంలో రహదారి ప్రమాదంగా మారటంతో సమస్య పరిష్కారానికై ఎన్‌హెచ్ పీడీతో కలిసి స్థల పరిశీలన చేశారు. కలెక్టర్ జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్‌తో, మసీదు కమిటీ సభ్యులతో ముస్లిం మత పెద్దలతో ఎమ్మెల్యే సమక్షంలో చర్చించి, రెండు మీటర్ల మసీదు స్థలాన్ని ఇవ్వటానికి మసీదు కమిటీ సభ్యులు అంగీకరించగా, భవిష్యత్‌లో జరిగే రోడ్డు విస్తరణలో ఎట్టి పరిస్థితిల్లో మసీదు వైపు రాకూడదని కమిటీ సభ్యులు కోరగా పీడీ దీనికి అంగీకరించటంతో సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. దీంతో జాతీయ రహదారి నిర్మాణం వేగంగా పూర్తవుతుందన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ మత పెద్దల మనోభావాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్, ఎన్‌హెచ్ పీడీ తీసుకువచ్చిన ప్రతిపాదనకు మత పెద్దలు అంగీకరించారని, పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో జేసీ డాక్టర్ అపరాజిత సింగ్, ఉయ్యూరు ఆర్డీవో విజయ్ కుమార్, మొవ్వ తహసీల్దార్ సీహెచ్ ఆంజనేయ ప్రసాద్, ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి కొనసాగుతున్న పూజలు



పామర్రు తోటలో వినాయకుడికి విశేష పూజలు చేస్తున్న భక్తులు



గుడివాడలో పూజలు నిర్వహిస్తున్న సత్యవేణి దంపతులు

పామర్రు: విఘ్నేశ్వర నవరాత్రులలో భాగంగా రెండో రోజు బుధవారం పలు చోట్ల విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక తోటలో స్వామికి విశేష పూజలను చేశారు. అంజిబాబు దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో 31 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలను చేశారు. చల్లపల్లి రోడ్డు, రాపర్ల, జమీదగ్గుమిల్లి,పోలవరం, ఉండ్రపూడి, కురుమద్దాలి, కనుమూరులో పూజలు నిర్వహించారు.

గుడివాడరూరల్: మండలంలోని రామనపూడి, బిళ్లపాడు, చిన ఎరుకపాడు, తటివర్రు, మోటూరు, వలివర్తిపాడు, లింగవరం, దొండపాడు, గుంటాకోడూరు, శేరీగొల్వేపల్లి, శేరీవేల్పూరు, చౌటపల్లి తదితర గ్రామాల్లో గణనాథుడికి భక్తులు విశేష పూజా కార్యక్రమాలు చేశారు.

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్‌లో విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను సందర్భంగా మూడో రోజు బుధవారం స్వామి వారిని శ్రీ శ్వేత గణపతిగా అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు. ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ పాల్గొన్నారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు బుధవారం కూడా కొనసాగాయి. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జ్యోతుల సత్యవేణి-శ్రీనివాసరావు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, జ్యోతుల మణికంఠ, మహిళా కార్యకర్తలు మూడెడ్ల ఉమ, హారిక, దేవి, సురేఖ పాల్గొన్నారు.

గుర్విందగుంట(పెదపారుపూడి): మండలంలోని గుర్విందగుంట గ్రామంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ఉత్సవ విగ్రహం నిమజ్జన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్‌పై గణనాథుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరిగించారు. ముఖ్యమంగా యువకులు డ్యాన్స్ లు చేశారు. కాలువలో నిమజ్జనం చేశారు.

పమిడిముక్కల: స్థానిక పంచాయతీ పరిధిలోని గుర్రాల్లంకలో 26 ఏళ్లుగా గణేష్ యాత్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ముత్రాసిపాలెం మహిళలుకోలాటప్రదర్శన చేశారు.

వైభవంగా గణేష్ ఉత్సవాలు

మండవల్లి: వినాయక చవితి ఉత్సవాలు మూడో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, వెలమపేట రామాలయం, శ్రీ కృష్ణాలయం, హైస్కూల్ సమీపంలో, సెంటర్‌లో స్టేషన్‌రోడ్డు కోదండ రామాలయం వద్ద పూజలు చేశారు.

ఆరోగ్య సర్వే సక్రమంగా నిర్వహించండి

డీఎల్పీవో కే పూర్ణచంద్రరావు

ముదినేపల్లి రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణా ప్రాంత ప్రజలు పూర్తి ఆరోగ్యంగా ఉండేలా సిబ్బంది కృషి చేయాలని డీఎల్పీవో కే పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని చిగురుకోటలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో స్థానిక సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ ప్రతి ఇంటినీ సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించాల్సిన బాధ్యత వలంటీర్లు, వైద్య సిబ్బందిపై ఉందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని గుర్తించడంతో పాటు వారికి ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న సేవల వివరాలు తెలియజేయాలన్నారు. గ్రామీణా ప్రాంత ప్రజలకు వైద్యం ఆర్థిక భారం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలందిస్తోందన్నారు. దీనిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సిబ్బందితో పాటు గ్రామంలో పర్యటించి సర్వే తీరును, వైద్య పరీక్షలను పరిశీలించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈవోపీఆర్డీ దూలం లక్ష్మీనారాయణ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ పర్యవేక్షణాధికారి వై.శేషగిరిరావు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఎన్‌ఆర్ జయంతి



పామర్రులో ఏఎన్‌ఆర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళాపీఠం సభ్యులు



గుడివాడలో ఏఎన్నార్‌కు నివాళులర్పిస్తున్న యాజమాన్యం, వాకర్స్‌క్లబ్ సభ్యులు

పామర్రు: పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్ఆర్) శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో హితమ్ స్కూల్‌లో బుధవారం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏఎన్ఆర్ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ, హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ నందిపాటి హేమంత్‌రెడ్డి,దంత వైద్యులు డాక్టర్ అనూప్‌కుమార్, డాక్టర్ లావణ్య, ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, వనిత, ధనలక్ష్మి, శ్రీలక్ష్మి, తనూజ పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: లక్షలాది మందికి విద్యనందించిన మహోన్నత వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు అని ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు అన్నారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత అక్కినేని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో విద్య విలువను గుర్తించి తాను కోల్పోయినది ఇతరులు కోల్పోకూడదనే సదుద్దేశంతో అలనాడు రూ.లక్ష వితరణగా ఇచ్చిన దాత అక్కినేని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి బ్రహ్మాజీ, కోశాధికారి చింతా రామకృష్ణ, ఎల్ఈ వెంకటేశ్వరరావు, బొగ్గారపు తిరుపతయ్య, లింగం చిట్టిబాబు, రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షుడు రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

గుడివాడ టౌన్: స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్ హెచ్ఎం టీఎంఈ రాణిని సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆమె బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులతోచాకిరీచేయిస్తున్నట్లు ఓదినపత్రికలో (సాక్షి కాదు) వార్త ఆధారంగా ఆర్‌జేడీ సస్పెన్షన్ వేటువేశారు.బుధవారం దీనిపై హై కోర్టులో వాదనలు విన్న అనంతరం సస్పెన్షన్ ఎత్తివేస్తూ రాణి అదే పాటశాలలో హెచ్ఎంగా కొనసాగేలా ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. ఎస్టీయూ, యూటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

తోట్లవల్లూరు: వివాహిత అదృశ్యమై ఘటన వల్లూరుపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మొగదాసి లక్ష్మి (45)ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవటంతో భర్త వెంకటేశ్వరరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు.

హనుమంతపురం మిల్క్‌సొసైటీ వైఎస్సార్ సీపీ కైవసం

పాలకవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే కైలే

పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురం మిల్క్ సొసైటీని వైఎస్సార్ సీపీ కైవసం చేసుకొంది. మిల్క్ సొసైటీలో బుధవారం పాల ఉత్పత్తిదారులతో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. డైరెక్టర్లుగా 9 మంది పోటీ పడగా వైఎస్సార్ సీపీకి ఐదు, టీడీపీకి నలుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైఎస్సార్ సీపీ తరపున సంఘ అధ్యక్షుడిగా కాగిత శ్రీరాములు, డైరెక్టర్లుగా మండవ వెంకట సురేష్, పోరంకి రాము, కలపాల రాఘవులు, శొంఠి పోతు రాజు ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, పీఏసీఎస్ అధ్యక్షులు గంగరాజు అభినందించారు. సంఘ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నికల అధికారిగా ఎండీ జాన్సన్ వ్యవహరించారు. నాయకులు సరికొండ సుబ్బరాజు, పామర్తి గౌతు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

పెదపారుపూడి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి దోహదపడాలని ఎంపీపీ హోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా రుణాలు తీసుకుని పనులు ప్రారంభించని వాళ్లను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ సమస్యలను పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీపీ దృష్టికి తీసుకుని వెళ్లాగా ఎంపీపీ ఇరిగేషన్ పవన్‌కుమార్ సమాధానం చెప్పాలని కోరారు. ఆయన సమావేశానికి రాకపోవటంతో మెమో ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని, ఎంపీటీసీలు చిగురుపాటి అశోక కుమారి, ఎం.జ్యోతి, తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ, సర్పంచ్‌లు పుణుకొలు శివరామప్రసాద్, నాగెదేశి సుబ్రహ్మణ్యం, ప్రత్తిపాటి హర్షవర్ధన్, ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

వేతన సమస్యలు పరిష్కరించాలి

కలిదిండి: ఉపాధ్యాయుల వేతనాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డెమోక్రసీ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను కోరారు. సంఘ మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలో బుధవారం నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కలిదిండి: నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. మండలంలోని కోరుకొల్లు శివారు చైతన్యపురం, పాత ఎస్సీ ఏరియా, ఎస్టీ కాలనీ, కొత్త ఎస్సీ ప్రాంతాల్లో రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు, ప్రతి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలు వంతున అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామన్నారు. అనంతరం కోరుకొల్లులోని జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థి వడ్రే వెంకట సత్యనారాయణ ఆర్థిక సాయంతో సాంస్కృతిక కళావేదిక, ప్రహరీని ప్రారంభించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఎంపీటీసీ చన్నంశెట్టి శిరీష, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

కైకలూరు: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ నియోజకవర్గ పరిధిలోని ఏపీ వైఎస్సార్ క్రాంతి పథకం యానిమేటర్స్ (వీఓఏ)ల ఉద్యోగ సంఘం బుధవారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ జి.రాజేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సమస్యలు తెలియజేయాలనుకునే వారు 99592 25464ను సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ ఈఈగా విజయదుర్గ



గుడివాడ టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బొక్కా విజయదుర్గ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం పురపాలక సంఘంలో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై గుడివాడ ఈఈగా బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థుల రక్త నమూనాల సేకరణ

గుడివాడ టౌన్: స్థానిక ప్రాంతీయ హోమియో పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్‌జే రాజ్‌కుమార్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ బృంద, డాక్టర్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కృష్ణ శ్రీనివాస్, రీసెర్చ్ సెంటర్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

గుడివాడ టౌన్: పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ.26 కోట్లు నిధులు మంజూరయ్యాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. బుధవారం స్థానిక 2వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో 90 శాతం పనులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు రూ.15 కోట్లు నిధులు మంజూరవగా పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయన్నారు. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) వినతి మేరకు రూ.26 కోట్ల నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ ఇంజినీర్ ప్రవీణ్, వైఎస్సార్ సీపీ నాయకులు లోయ వరాలు, పంచకర్ల వెంకట్, ఆర్.మురళీధర్ పాల్గొన్నారు.